## ప్రజావాణిలో 16 ఫిర్యాదులు స్వీకరించిన సీపీ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం పోలీస్ కమిషనర్ సాయి చైతన్య 16 ఫిర్యాదులను స్వీకరించాడు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని సీపీ తెలియజేశారు.

## పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన జిజిహెచ్ సూపరింటెండెంట్



హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను నిజామాబాద్ జిజిహెచ్ ఇంచార్జీ సూపరింటెండెంట్ ప్రొ.డా.నాగ మోహన్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గా ఉన్న ప్రొ.నాగ మోహన్ కు ప్రభుత్వ జనలర్ ఆసుపత్రి ఇన్ చార్జి సూపరింటెండెంట్ గా నియమించిన విషయం విదితమే. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు అలుక కిషన్, అమ్రుత్ కుమార్, నాయకులు దయానంద్, దండు స్వామీల అధ్వర్యంలో నాగ మోహన్ పిసీసీ చీఫ్ ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## రైతుల కోసం అందుబాటులో ట్రాన్స్ ఫార్మర్ వాహనాలు

### నిజామాబాద్ ఎస్ఈ పి.వి.రాజేశ్వర్ రావు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ డిపార్ట్మెంట్ ట్రాన్స ఫార్మర్ వాహనాలను అందుబాటులో ఉంచినట్లు నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. వి. రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో డిపార్ట్మెంట్ వాహనాలు 20 సెంటర్ల ఏర్పాటు చేశామని, అందులో ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయడిని తద్వారా ప్రతి వాహనము మూవ్మెంట్ చేపూర్తి గమనించడంతో రైతులకు అత్యవసరం కలగకుండా సర్కిల్ పరిధిలో తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి డివిజన్, సబ్ డివిజన్ పరిధిలో డిపార్ట్మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలు అందుబాటులో ఉండడానికి ట్రాన్స్‌ఫార్మర్ ఒక ఫ్లేస్ కాలిపోయిన వెంటనే సంబంధిత అధికారికి తెలియజేసి డిపార్ట్మెంట్ వాహనం ద్వారానే అందుబాటులో 100% మెరుగైన సేవలు అందిస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా అత్యంత ప్రాధాన్యమని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎంపీలు సేవలు అందించేందుకు ఈ ప్రత్యేక డిపార్ట్మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాన్సుమర్లకు డిస్ట్రిబ్యూషన్ సంస్థల ద్వారా లక్షల రూపాయల పెట్టి మరమ్మత్తులు చేయడం లోనా విద్యుత్ శాఖ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడం కోసం ఈ వాహనాలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ సీజన్ సమయంలో రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు ఇది ఎంతగానో ఉపయోగకరమని వివరించారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ సమస్య తలెత్తిన వెంటనే ఈ వాహనాల ద్వారా స్పందించి, సమయాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీనివల్ల రైతులకు సమయానికి అందుతున్నాయని తద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైన వెంటనే సమీప విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని, వచ్చే పరిష్కరించేందుకు నియమించిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ పరిరక్షణ శాఖలతో సంప్రదించాలని సూచించారు. ఎలాంటి తక్షణపరమైన సమస్యలు తలెత్తిన వెంటనే 1912 కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తక్షణం స్పందించి తక్షణపరమైన విద్యుత్ సేవలు అందిస్తామని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం ఎన్పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేసి రైతుల ఆదరణ చూరగొనాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ పిలుపునిచ్చారు.

# క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

### అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :క్షయ రహిత సమాజమే మన అందరి లక్ష్యమని, క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని క్షయ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో క్షయ రహిత గ్రామపంచాయతీల కు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. క్షయ రహిత గ్రామ పంచాయతీలుగా నిలిచిన 18 గ్రామ పంచాయతీలకు జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 18 గ్రామపంచాయతీలే కాకుండా జిల్లాలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో పట్టణాల్లో క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ టిబి ముక్తభారత్ అభియాన్ 1.0 గత సంవత్సరం 28వ తేదీ మే నెలలో ప్రారంభించడం జరిగిందని, దీనిలో భాగంగా జిల్లాలో 342,889 మంది జనాభాను టార్గెట్ గా నిర్ణయించగా, 88000 మందికి మొబైల్ ఎక్రే ద్వారా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 13000 మందికి సిబి నాట్ ద్వారా పరీక్షలు నిర్వహించడం జరిగింది. వీరిలో 489 మందికి క్షయ పాజిటివ్ గా నిర్ధారణ కాగా, పాత క్షయ వ్యాధిగ్రస్తులు 1255 ఉన్నారని, ఈ సంవత్సరం మార్చి 24 వ తేదీన టీవీ ముక్తభారత అభియాన్ 2.0 ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 112 గ్రామాలలో మూడు డిజిటల్ ఎక్రే మిషన్ లు, 8 టీబీ నాట్ మిషన్ల ద్వారా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.
ఈ శిబిరంలో ఇంకా హెచ్ఐవి, హెచ్బీఎస్ ఏజీ, వైడల్, హెచ్బి ,బిపి ,ఆర్ బి ఎస్ మొదలగు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 2026 సంవత్సరం కి 18 జీపీ లూ ఈ అవార్డు లను పొందాయని, వీటిలో పోతునూరు, తాళ్ల రామడుగు సిల్వర్ అవార్డు పొందాయని, మిగితా జీపీ లు కాంస్య అవార్డు పొందాయన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ చేతుల మీదుగా టీవీ ముక్తభారత అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. క్షయ వ్యాధి నియంత్రణలో జిల్లాలో అంకితభావంతో పనిచేసిన సిబ్బంది రేడియో గ్రాఫర్ కాలేద్, ఎస్ టీ ఎస్ లు స్రవంతి, పద్మ, టీబీహెచ్బీలు ఏ జౌన్ అహ్మద్, విజయ మాల, ల్యాబ్ టెక్నీషియన్ స్వరాజ్యలకు మేమొంటోలు అందించారు. ఈ కార్యక్రమం లో జడ్పీసీఈవో సాయా గౌడ్, డీఆర్డిఏ పిడి సాయన్న, డిఎంహెచ్ఓ డా.రాజశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.దేవి నాగేశ్వరి, జిల్లా అధికారులు, గ్రామ సర్పంచ్ లు, పంచాయతీ సెక్రెటరీలు, వైద్య సిబంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొడవలితో భర్తను నరికి చంపిన భార్య అరెస్ట్



కామారెడ్డి, బతుకమ్మ :మాంసం కూర వండలేదని అడిగినందుకు భర్తను హత్య చేసిన భార్యని పోలీసులు సోమవారం పట్టుకుని అరెస్ట్ చేశారు. కామారెడ్డి పట్టణం లోని గోసంగి కాలనీలో ఈ నెల 25 న రాత్రి 10 గంటల సమయంలో కోదండం లక్ష్మి తన భర్త కోదండం శివాజీపై కొడవలితో మెడపై దాడి చేసింది. తీవ్ర గాయాలతో శివాజీ అక్కడికక్కడే మరణించాడు. శివాజీ అన్న కోదండం సూరి ఇచ్చిన ఫిర్యాదుతో కామారెడ్డి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు రక్తపు నమూనాలు, ఇతర భౌతిక సాక్ష్యాలు సేకరించారు. విశ్వసనీయ సమాచారంతో ఏప్రిల్ 27న సోమవారం కామారెడ్డి రైల్వే స్టేషన్ వద్ద నిందితురాలు లక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె నేరాన్ని అంగీకరించింది. హత్యకు ఉపయోగించిన కొడవలి, రక్తపు మరకలతో ఉన్న చీరను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివాజీకి మద్యం, జూదం అలవాట్లు ఉండేవని, కుటుంబ సమస్యలపై భార్యను తరచే వేధించేవాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని, ఏప్రిల్ 25న జరిగిన ఘర్షనలో ఆవేశానికి లోనైన లక్ష్మి ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఇన్ చార్జి డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో పట్టణ ఇన్స్ పెక్టర్ బి.నరహరి కేసును సమర్థవంతంగా విచారించారు. నిందితురాలిని కోర్టులో హాజరుపర్చగా న్యాయ స్థానం రిమాండ్ కు తరలించింది.

## ఏర్గట్ల పాఠశాలలో జనాభా లెక్కలకై శిక్షణ కార్యక్రమం



ఏర్గట్ల, బతుకమ్మ :మండలం కేంద్రంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు జనాభా లెక్కలు 2027 లో భాగంగా సోమవారం ఏర్గట్ల మండలంలో జనాభా లెక్కలు చేయు 29 మంది టీచర్లు, ఎనుమ రెటర్లు, 6 మంది టీచర్లు, సూపర్ వైజర్లు లకు 3 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో మండల జనాభా లెక్కల చార్జ్ అధికారి ఏర్గట్ల మండల తాసిల్దార్ జె మల్లయ్య, అదనపు చార్జి అధికారి మండల విద్యాధికారి, ఆనంద రావు, ట్రైనర్ లు ఐలాపూర్ రాజు, క్యాతం నరేందర్, మండల రెవిన్యూ పరిశీలకులు సదానందం, గ్రామ పాలన అధికారి, ఏర్గట్ల వెంకటేష్, పాల్గొన్నారు.

## గోమాతను జాతీయమాతగా ప్రకటించాలి



భిక్కనూరు, బతుకమ్మ :పార్లమెంటులో చట్టం చేసి గోమాతను జాతీయమాతగా ప్రకటించాలని గోమాత నిర్వాహకులు అన్నారు. గోహత్యలను నిషేధించాలని సోమవారం దేశ వ్యాప్తంగా 5000 పై చిలుకు ఎమ్మార్వో కార్యాల ద్వారా రాష్ట్రపతికి, ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రులకు మెమోరండం పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుత కాలంలో గోవుల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోతుందన్నారు. భారతీయ సంస్కృతిని కాపాడడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి గోమాతను జాతీయ మాతగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తునికి వేణు, లక్ష్మణ్, రాజబాబు గౌడ్, రమేష్, పరమేష్, నరేందర్ రెడ్డి, సంజీవ్, అశోక్ హిందూ సంఘాల కార్యకర్తలు ఉన్నారు.

## తెవివి పాలక మండలి సభ్యుడు డా.దండు స్వామికి ఉన్నతాధికారుల అభినందనలు





డిచ్ పల్లి, బతుకమ్మ :తెవివి పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన డా.దండు స్వామి సోమవారం ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసారు. తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్య సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ బాలభాస్కర్, ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, పూర్వ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితర ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం వారు డా.దండు స్వామికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.